క్లుప్తంగా

ఘనంగా మహిళా దినోత్సవం

వినుకొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం సీడీపీవో ఎం.అనూరాధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు వారి కెరీర్‌పై దృష్టి పెట్టాలన్నారు. పోషకాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల అధ్యాపకులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



వినుకొండ: పట్టణంలోని ఎఫ్‌పీసీఎల్ ఆఫీస్‌లో సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పథకాలపై బుధవారం అవగాహన కల్పించారు. నాబార్డు, సెర్ప్ ఆధ్వర్యంలో సీఎస్ఎస్ పథకం కింద ఏర్పాటు చేయబడిన ఎఫ్‌పీవో, బీవోడీలు, ఆసక్తి గల రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. నాబార్డు పల్నాడు జిల్లా డీడీ ఎం.శరత్‌బాబు, సీనియర్ మేనేజర్ డీఎంఏ కిరణ్‌ప్రభు, కిరణ్, సెర్ప్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన

వినుకొండ : మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మేలు జాతి లేగదూడల ప్రదర్శన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసరావుపేట డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ పి. రామారావు మాట్లాడుతూ గ్రామంలోని రైతులందరూ తమ ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ ద్వారా మేలుజాతి దూడలు ఉత్పత్తి చేయవచ్చన్నారు. గుంటూరు జిల్లా డీఎల్‌డీఏ పశువైద్యాధికారి డాక్టర్ చలపతి మాట్లాడుతూ లింగనిర్ధారణ వీర్యం ద్వారా పెయ్యదూడలు మాత్రమే ఉత్పత్తి చేసే పథకాన్ని పశుపెంపకందారులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం 45 దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వినుకొండ ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ బి.సరోజాదేవి, పిట్టంబండ వైద్యాధికారి డాక్టర్ శివాజీ, డాక్టర్ ఎం. మనోజ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గణనాథా.. మమ్మల్ని మన్నించు!

- ఆరాధనకు ఆంక్షల అడ్డుగోడలు
- కారుచోల తిరునాళ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభలు నిలిపివేత

యడ్లపాడు: పెదనందిపాడు బ్రాంచ్ కాలువ ఒడ్డున కొలువుదీరిన విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షిక తిరునాళ్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ల అంటే అక్కడి ప్రజలకు తాతలకాలం నుంచి కొనసాగుతున్న ఒక పవిత్ర సంబరం. తమ సంప్రదాయాలను నిరంతరం కొనసాగించాలనే నిబద్ధతతో సమీప గ్రామాల ప్రజలు సంవత్సరాలుగా ప్రభలను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. కానీ ఈసారి ప్రభల నిర్వహణ రాజకీయ అడ్డంకులకు గురవ్వడం, ప్రజల మనోభావాలను గాయపరచడం ఆవేదనకరం.

ఏటా పోటాపోటీగా శోభాయాత్ర...

ఈ తిరునాళ్లకు ఏటా గుత్తావారిపాలెం, గనికపూడి గ్రామాల నుంచి ఒక్కొక్క ప్రభను ఆయా గ్రామస్తులు ఏర్పాటు చేస్తుండగా, కారుచోల గ్రామం నుంచి అత్యధికంగా ప్రభలను తీసుకొచ్చేవారు. పార్టీలు వేరైనా తిరునాళ్లకు వచ్చిన భక్తులకు



కారుచోల-గుత్తావారిపాలెం విఘ్నేశ్వరస్వామి మూలవిరాట్

ఎవరి ప్రభల వద్ద వారు వినోదాల విందును ఏర్పాటు చేయడం మూడు దశాబ్దాలకు పైగా వస్తున్న ఆనవాయితీ. ఏడాది కాలంగా ఎంతో ఆశగా ఎదురు చూసే తిరునాళ్ల సంబరం నాడు గ్రామస్తుల్లో నిరాశ తప్పలేదు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రభలకు ఆంక్షల వల్ల శోభాయాత్ర చేసుకునే వీలులేకుండా పోయిందని నిర్వాహకులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అధికార పార్టీ వారి ప్రభలకు అనుమతులు మంజూరు చేస్తూ, వైఎస్సార్‌సీపీ వర్గీయులకు కఠిన ఆంక్షలు విధించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు రోజులు ముందుగానే జగన్ బొమ్మలు, పార్టీ జెండాలు, డ్యాన్సుల నిర్వహణ లేకుండా ప్రభలు ఏర్పాటు చేసుకోవాలంటూ ఆంక్షలు విధించి తిరునాళ్ల రోజు మధ్యాహ్నం గ్రామపెద్దలతో ప్రభలు కట్టుకోండని చెప్పడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే అధికారులు ఇలా తమను వేధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కూటమి నాయకుల డీజేను వైఎస్సార్‌సీపీ వారి ఇళ్ల ముందు నిలిపి ఆయా పార్టీ అధినేతల రెచ్చగొట్టే డైలాగ్‌లను పెట్టినప్పుడు ఎన్నికల కోడ్‌లు, పోలీసుల ఆంక్షలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. ఏ సమాజంలోనైనా సంప్రదాయాలు, ఆరాధన ప్రాధాన్యం కలిగిన అంశాలు. వాటిని రాజకీయాల పేరిట అణచివేయడం, కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎక్కడ తమపై కేసులు పెట్టి వేధిస్తుందోనని భయాందోళలతో ఆయా విషయాలను చెప్పేందుకు సైతం పలువురు వెనుకాడుతున్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ

నాదెండ్ల: ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన కూడళ్లలో బస్‌షెల్టర్లు నిర్మించటం అభినందనీయమని చిలకలూరిపేట ఆర్‌కే హాస్పటల్స్ డాక్టర్ చాపలమడుగు రామకృష్ణ చెప్పారు. గణపవరం మెయిన్ రోడ్డు ముఖద్వారం పక్కన నిర్మిస్తున్న బస్‌షెల్టర్‌కు బుధవారం భూమిపూజ నిర్వహించారు. నిర్మాణ కమిటీ సభ్యులు కెల్లంపల్లి అచ్చయ్య మాట్లాడుతూ సుమారు రూ.5 లక్షల వ్యయంతో దీనిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ చాపలమడుగు రామకృష్ణ రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారని, మరి కొంతమంది దాతలు విరాళాలు ఇచ్చి సహకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు, నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, పెంటేల శేషయ్య, కాట్రు శ్రీనివాసరావు, గాలి బుచ్చయ్య, వలేటి నరసింహారావు, జంపని వెంకటరత్నం, కాట్రు రోశయ్య, కాట్రు కృష్ణారావు పాల్గొన్నారు. కాగా, రూ.15 లక్షల విరాళాలతో గణపవరం మెయిన్‌రోడ్డులో ఆర్చ్ నిర్మించామని గ్రామ పెద్దలు తెలిపారు. 9వ తేదీన ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా ఆర్చ్, ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఉందని చెప్పారు.



భూమి పూజలో డాక్టర్ రామకృష్ణ, గ్రామ పెద్దలు

కొనసాగుతున్న 'ఫేస్ వాష్ అండ్ గో'

నరసరావుపేట: రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ నిర్వహిస్తున్న 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం రాత్రి పలు రహదారుల్లోని బ్లాక్‌స్పాట్ల వద్ద పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈకార్యక్రమం నిర్వహించారు. యడ్లపాడు, రొంపిచర్ల, రాజుపాలెంలోని ముఖ్యమైన రహదారుల వద్ద, పిడుగురాళ్ల పోలీసుస్టేషన్ పరిధిలోని తుమ్మలచెరువు టోల్ గేట్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు సిబ్బంది అర్ధరాత్రి దాటాక లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు, తదితర వాహనాలను నిలిపి డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపించారు. అలాగే జిల్లావ్యాప్తంగా రాత్రిళ్లు పోలీసులు గస్తీలు నిర్వహించి బస్టాండు, రైల్వేస్టేషన్లలో కొత్తవ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టారు. ఏటీఎంలు, బ్యాంకులు, ఊరి చివర ఉన్న కాలనీలలో ముమ్మరంగా గస్తీలు నిర్వహిస్తున్నారు.



తుమ్మలచెరువు టోల్‌గేట్ వద్ద లారీ డ్రైవర్‌చే నీటితో ముఖం కడిగిస్తున్న పోలీసులు

రుణాలను సకాలంలో చెల్లించాలి

శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ పరిధిలో రైతులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సీఈవో జాలాది నాగప్రసాదు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1,100 రైతులకు రూ. 40 కోట్లు రుణాలను మంజూరు చేశామన్నారు. మార్చి నెలాఖారులోగా రుణాలను రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. వ్యవసాయ రుణానికి రూ. లక్షకు వడ్డీ కింద రూ. 7 వేలు చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలని పేర్కొన్నారు. గడువు దాటితే సంబంధిత రైతుకు అదనపు వడ్డీ భారం పడుతుందన్నారు.

12న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నాదెండ్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీన ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో స్వరూపారాణి బుధవారం చెప్పారు. ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై చర్చ, గత సమావేశాలపై సమీక్ష ఉంటుందన్నారు.

ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

రొంపిచర్ల: మండలంలోని పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశం కోసం విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు పి. హవిలాల్, డి. బ్రహ్మేశ్వరరావులు బుధవారం ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన

శావల్యాపురం: గ్రామ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించటానికి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు ఎంతో దోహదపడతాయని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐటీసీ – ఆసిస్ట్ వారి సారథ్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ సహాయకులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రజలకు ఉపయోగకరకమైన పనులను గుర్తించాలని సూచించారు. సర్పంచుల విధులు, నిధుల వినియోగం గురించి వివరించారు. అత్యంత ప్రాధాన్యత పరంగా గుర్తించిన పనులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని పేర్కొన్నారు. విజయవాడ రీసోర్స్ పర్సన్ ఎల్. వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, ఐటీసీ కో ఆర్డినేటరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

ఆర్టీసీలో పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలి

- ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి
- డిపోలో ఘనంగా మహిళా దినోత్సవం

నరసరావుపేట: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. బుదవారం ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యాలయాన్ని డాక్టర్ సీహెచ్ గౌతమి ప్రారంభించారు. ఈసందర్భంగా డిపో ప్రాగంణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డులో ఈయూ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈయూ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాజా అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దామోదరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీమేరకు వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉద్యోగులకు బకాయిపడ్డ 11వ పీఆర్సీ, డీఏ బకాయిలు, పెండింగు డీఏలు చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య మాట్లాడుతూ ఈహెచ్ఎస్ ఏఒక్క ఉద్యోగికి ఉపయోగకరంగా లేదని, దీని ద్వారా క్యాష్‌లెస్ ట్రీట్‌మెంటు జరిగేలా చూడాలని కోరారు. న్యాయవాది సీజే ప్రతాప్, సంఘం రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కోటేశ్వరరావు, మందపాటి శంకరరావు, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.కోటేశ్వరరావు, నెల్లూరు జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు వాకా రమేష్, దాసరి బాబూ శామ్యూల్, జిల్లా కార్యదర్శి జీటీ రావు, జిల్లా వర్కింగు ప్రెసిడెంట్ ఎస్.కె.ఆసీఫ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, ఆరు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలి

శావల్యాపురం: ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని ఏడీఏ బోయపాటి రవిబాబు కోరారు. బుధవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ పంటకు ముందుగా పొలాల్లో నవధాన్యం విత్తనాలను చల్లాలన్నారు. తద్వారా చీడపీడలు నివారణ సాధ్యపడుతుందన్నారు. పశువులకు మేతగా కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకుడు సైదయ్య మాట్లాడుతూ ప్రతి రైతు అంతర పంటల విధానం ఆచరించాలన్నారు. సేంద్రియ ఎరువుతో సాగు చేసిన వాటిని తినటం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. డ్వాక్రా సభ్యులు గ్రామాల్లోని రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఉత్తమ రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, శిక్షకుడు సైదయ్య, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వన్నెపు తిరుపతిరావు, పాండురంగ స్వామి, ఏపీఎం జి.వాసుబాబు, ఏఈవో పురేటి అశోక తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ రైతును సత్కరిస్తున్న అధికారులు

రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి

శావల్యాపురం: రైతుసేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ బోయపాటి రవిబాబు తెలిపారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నంబరు, సెల్‌ఫోను నంబరు వంటి వివరాలను రైతు సేవా కేంద్రంలోని వీఏఏలను సంప్రదించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. సదరు రైతుకు 11 అంకెలతో కూడిన ప్రత్యేక సంఖ్య కేటాయిస్తారని చెప్పారు. భవిష్యత్‌లో 11 అంకెల ఆధారంగా కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ పథకాలు, బ్యాంకు రుణాలు పొందటానికి అర్హత ఉంటుందన్నారు. ఏవో రామినేని రామారావు, ఏఈవో పురేటి అశోక, వీఏఏ స్రవంతి పాల్గొన్నారు.

నేడు పువ్వాడమ్మ తిరునాళ్ల



నూజెండ్ల: మండలంలోని పువ్వాడ గ్రామంలో వేంచేసియున్న పువ్వాడమ్మ తిరునాళ్ల గురువారం జరగనుంది. ఏటా మాదిరిగానే తిరునాళ్ల వేడుకల్లో విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీ వీరబ్రహ్మం గారి నాటక ప్రదర్శన ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అయినోలు ఎస్సై ఎంవీ కృష్ణారావు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

ఎన్‌సీసీ అధికారి సేవలు స్ఫూర్తిదాయకం

నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం.రాజేష్‌బాబు సేవలు స్ఫూర్తిదాయకం అని వక్తలు ప్రశంసించారు. ఆయనకు సన్మాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఢిల్లీ ఎన్‌సీసీ డైరక్టర్ జనరల్ లెఫ్టినెంట్ హోదా కల్పించడంతో ఈ సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎన్‌సీసీ గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్, కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్నల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. క్యాడేట్స్‌లోని నైపుణ్యాన్ని వెలికి తీయడంలో విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, మాజీ బీఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ జి.ప్రసాదరావు, ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి డిమాండ్

రొంపిచర్ల: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్థానిక కార్యాలయంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జీవో నెం. 2 సమగ్ర శిక్ష ఉద్యోగులకు వర్తించేలా విద్యాశాఖ మంత్రి చొరవ తీసుకోవాలన్నారు. ప్రతినెలా 1వ తేదీన జీతాలు అందజేయాలని కోరారు. మానవతా దృక్పథంతో తమకు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్‌రావు, పి. రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్ బాడ్మింటన్ జట్టుకు ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా బాల్ బాడ్మింటన్ జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని షేక్ ముంతాజ్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ నెల 3, 4వ తేదీలలో వర్సిటీ అంతర్ కళాశాలల పోటీల్లో ముంతాజ్ ప్రతిభ చాటి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. తమిళనాడులో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థినిని కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు, అధ్యాపకులు అభినందించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన

బొల్లాపల్లి: పదో తరగతి పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖ అధికారి –2 కె.పార్వతి బృందం బుధవారం పరిశీలించారు. మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూళ్లను పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను బృందం సభ్యులు పరిశీలించారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. బృందంలో కె.అపర్ణ, షేక్ అలీసా, లీలావతి, వి.పద్మావతిలు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నరసరావుపేట రూరల్: కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాల విద్యార్థినులు మహిళల బాల్ బ్యాడ్మింటన్ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు బుధవారం తెలిపారు. అఖిల, షేక్ ఆఫ్రిన్‌లు ఏఎన్‌యూ జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. తద్వారా జాతీయ స్థాయి ఇంటర్ వర్సిటీ పోటీలలో వర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. విద్యార్థినులను కళాశాల డైరక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, అధ్యాపకులు అభినందించారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట రూరల్: పంట కాలువలను ఆక్రమించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, బాదుగున్నల శ్రీనివాసరావులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని రావిపాడు, పాలపాడు, అల్లూరివారిపాలెంలో పెద్ద ఎత్తున రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పంట కాలువలను ఆక్రమించారని ఆరోపించారు. కలెక్టరేట్, ఎస్‌ఎస్‌పీ కార్యాలయానికి సమీపంలోనే ఇంత జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడం తగదని తెలిపారు.

26 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాలలో బుధవారం ఐఈసీఈ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 26 మంది విద్యార్థులు కమ్యూనికేషన్ ట్రైనర్ ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ మేజర్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. వివిధ కళాశాలల నుంచి 119 మంది విద్యార్థులు హాజరు కాగా, ఈ కళాశాల నుంచి 26 మందిని ఎంపిక చేసినట్టు వివరించారు. వారిని కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రేమ్‌చంద్, జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాదు, అకడమిక్ ప్రిన్సిపల్ కె.హరికృష్ణ అభినందించారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 450 మందికి వివిధ కంపెనీలు ఆఫర్ లెటర్లు అందించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తెలిపారు. గుంటూరు పెరల్ సంస్థ, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ మేళా ఏర్పాటు చేశారు. దాదాపు 750 మంది మేళాకు హాజరైనట్టు వివరించారు. పెరల్ సంస్థ సీఈఓ ఎం.గురవయ్య, మ్యాజిక్ బస్ ప్రాజెక్ట్ మేనేజర్ సీహెచ్ మోహన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పుష్పలత, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాససాయి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్

వినుకొండ: హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ పిలుపుమేరకు ఎంఈవో ఆఫీస్ వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల చేపట్టిన సమ్మె విరమించినా ముఖ్య డిమాండ్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ఆడ పిల్లల తల్లులకు సత్కారం

బొల్లాపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మేళ్లవాగు అంగన్‌వాడీ సెంటర్‌లో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లులను ఘనంగా సత్కరించారు. ఆడపిల్ల ఇంటికి వెలుగు అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. బాల్యవివాహాలను అరికట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.సరోజిని, సీత, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ ఆయాలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాగ్దేవి విద్యార్థినులకు ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ కుపలవాయి రాజేంద్రప్రసాదు బుధవారం తెలిపారు. ఇన్ఫోసిస్ కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు గుంటూరు కిట్స్ కళాశాలలో నిర్వహించిన ఎంపికలో మేకల మౌనిక, మార్నెళ్ల శిల్ప ఉద్యోగాలు సాధించారని వివరించారు. రూ.3 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి కృష్ణకిషోర్, అధ్యాపకులు వారిని అభినందించారు.

త్వరలో ఇనాం భూములు రీసర్వే

ఈపూరు (శావల్యాపురం): త్వరలో ఇనాం భూముల రీసర్వే ఉంటుందని, రీసర్వే పనులు పారదర్శకంగా రైతుల సమక్షంలో చేపట్టాలని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత అన్నారు. బుధవారం మండలంలోని కొచ్చర్ల గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు నరసరావుపేట డివిజన్ పరిధిలోని ఇనాం భూములు సర్వే పనులు ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. ఈపూరు మండలం అంగలూరులో ఉన్న 1,254 ఎకరాలు ఇనాం భూముల సర్వే పనులు త్వరలో అధికారుల పర్యవేక్షణలో ప్రారంభం అవుతాయన్నారు. రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి అగ్రహారం, వినుకొండ రూరల్ నాగులవరం, శివాపురం, నాదెండ్ల మండలం నూజెండ్లపల్లి అగ్రహారం, బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు, నూజెండ్ల మండలం అప్పాపురం, కొండ్రప్రోలు, తిమ్మాపురం గ్రామాల్లోని ఇనాం భూములను కూడా త్వరలో రీసర్వే చేస్తామని పేర్కొన్నారు. ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామంలో 5,250 ఎకరాలకుగాను 1,080 ఎకరాల్లో రీసర్వే పూర్తి అయినట్లు తెలిపారు. రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు ఎ. నళిని, మండల సర్వేయర్ పవన్‌కుమార్, వీఆర్వో వేల్పూల శ్యాంసోన్, సచివాలయ సర్వేయర్ బాల నాయక్, రైతులు పాల్గొన్నారు.



కొచ్చర్లలో రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత